సాక్షి వరంగల్

శుక్రవారం | 20 | డిసెంబర్ | 2024



విద్యార్థుల మధ్య వివాదం..

కాకతీయ యూనివర్సిటీలో జీపీఈడీ, ఎంఙీఏ విద్యార్థుల మధ్య వివాదం తలెత్తింది.వివాదం తలెత్తడానికి గల కారణాలు తెలుసుకునేం దుకు కమిటీని నియమించారు. - 8లో▸



మహిళలు.. స్వశక్తులు

మహిళలు ఓ వైపు కుటుంబ బాధ్యతలు నిర్వ హిస్తూనే.. మరోవైపు తమకు ఆసక్తి ఉన్న టైలరింగ్‌పై మక్కువ చూపుతున్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$29^0/20^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



గీసుకొండ: మండల కేంద్రంలో స్వయంభూగా నల్లరాతి గుట్టపై వెలసిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టుకు చెందిన హిమ చిట్‌ఫండ్స్ డైరెక్టర్ బిల్లా గోపాల్‌రెడ్డి –హేమలత దంపతులు గురువారం రూ.1,00, 116 విరాళం అందించారు. గుట్టపైన ఉన్న స్వామి వారి ఆలయం ఎదుట శాశ్వత రేకుల షెడ్డు నిర్మాణం కోసం ఖర్చు చేయాలని వారు కోరారు. అవసరమైతే మరింత సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగుల సాంబరెడ్డి–మంజుల దంపతులు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు కర్ణకంటి రామ్మూర్తి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

దేవుడి ఆభరణాల దొంగ అరెస్ట్

- మూడు మండలాల ఆలయాల్లో చోరీ

గీసుకొండ: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం వంగపల్లి గ్రామానికి చెందిన కొలిపాక రాజు పలు ఆలయాల్లో చోరీ చేశాడు. కమలాపూర్, గీసుకొండ, ముల్కనూరులోని పలు ఆలయాల హుండీలను పగులగొట్టి నగదుతోపాటు దేవుడి బంగారు, వెండి ఆభరణాలు, సామాను ఎత్తుకెళ్లి కొంతకాలంగా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈ ఏడాది సెప్టెంబర్ 21న రాత్రి గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట కట్టమల్లన్న ఆలయం పక్కన ఉన్న రేణుకాఎల్లమ్మ ఆలయం తాళాలు పగులగొట్టి దేవతామూర్తులు, బంగారు, వెండి ఆభరణాలను అపహరించి పరారయ్యాడు. గీసుకొండ పోలీసులు వరంగల్–నర్సంపేట రహదారిలోని ఊకల్ క్రాస్‌రోడ్డులో గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా బైక్‌పై రాజు అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకున్నారు. విచారించగా ఆలయాల్లో చోరీ బాగోతం బయటపడిందని, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ



నర్సంపేట: ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని ఉప్పల్ రింగ్‌రోడ్డు నుంచి నర్సంపేటకు బయలుదేరింది. ఓ ప్రయాణికుడు ఆ బస్సులో ఎక్కి హనుమకొండ అంబేడ్కర్ విగ్రహం వద్ద దిగాడు. తన రూ.90 వేల విలువ చేసే ల్యాప్‌టాప్‌ను బస్సులోనే మరిచిపోయాడు. ల్యాప్‌టాప్ గుర్తుకు వచ్చిన వెంటనే ప్రయాణికుడు డ్రైవర్ మహేందర్‌రెడ్డి నంబర్ తెలుసుకొని ఫోన్ చేశాడు. ఆ ల్యాప్‌టాప్‌ను భద్రపరిచి డిపో అధికారులకు సమాచారం అందించాడు. హనుమకొండ గోపాలపురానికి చెందిన ప్రయాణికుడు సయ్యద్ ఫరాజుద్దీన్‌గా గుర్తించారు. అదేరోజు రాత్రి నర్సంపేట డిపో కంట్రోలర్ జనార్దన్, సెక్యూరిటీ కానిస్టేబుల్ పృథ్వీ సమక్షంలో ల్యాప్‌టాప్‌ను ప్రయాణికుడికి డ్రైవర్ మహేందర్‌రెడ్డి అందజేశాడు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డిని డిపో మేనేజర్ కె.ప్రసూనలక్ష్మి అభినందించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి



నెక్కొండ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు పెంచాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి పద్మశ్రీ అన్నారు. నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రోహిలాతన్వీర్ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఇంటర్వ్యూలు

విద్యారణ్యపురి: హనుమకొండలోని కేడీసీ మైక్రో బయాలజీ విభాగంలో అతిథి అధ్యాపకుడి నియామకానికి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జి.రాజారెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. సంబంధిత పీజీ కోర్సుల్లో 55 శాతం మార్కులు కలిగి ఉండి నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈనెల 20న కళాశాలలో సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

సమ్మెకు సన్నద్ధం



ఆందోళన బాటలో మల్టీపర్పస్ వర్కర్లు

- ప్రభుత్వానికి నోటీసు ఇచ్చిన గ్రామ పంచాయతీ కార్మికులు
- జిల్లాలో 323 జీపీలు.. 1,112 మంది సిబ్బంది



నల్లబెల్లిలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

డిమాండ్లు ఇవే..

- గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి. ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు ఇవ్వాలి.
- రెండో పీఆర్సీ పరిధిలోకి గ్రామ పంచాయతీ సిబ్బందిని తీసుకురావాలి.
- జీఓ 60 ప్రకారం కేటగిరీల వారీగా జీతాలు చెల్లించాలి. జీఓ 51ని సవరించాలి. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి. పాతకేటగిరీలు కొనసాగించాలి. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలి. అర్హులైన సిబ్బందికి పదోన్నతులు కల్పించాలి. పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేసి, వేతనాలు పెంచాలి.
- ఆన్‌లైన్‌లో నమోదు కాని కార్మికుల పేర్లను నమోదు చేసి నేరుగా వారికి వేతనాలు చెల్లించాలి. –పంచాయతీల అవసరాల ప్రాతిపదికన కార్మికుల సంఖ్యను పెంచాలి.
- కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, స్థలాలు కేటాయించాలి.
- చనిపోయిన, అనారోగ్యానికి గురైన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలి.

నల్లబెల్లి: డిమాండ్ల సాధన కోసం గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. కనీస వసతులు కూడా కల్పించడం లేదని, వేతనాల విషయంలోనూ చిన్నచూపే ఎదురవుతోందని వారు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని విజ్ఞప్తి చేస్తూ ఇప్పటికే ఆందోళన బాటపట్టిన కార్మికులు.. మరోసారి సమ్మెకు సన్నద్ధమవుతున్నారు.

వేతనం తక్కువ.. పనిఒత్తిడి

జిల్లాలో 11 గ్రామీణ మండలాలు ఉన్నాయి. 323 గ్రామ పంచాయతీల్లో జనాభా ప్రాతిపదికన 1,112 మంది మల్టీపర్పస్ వర్కర్లు అభివృద్ధిలో భాగస్వాములవుతూ పనిచేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు గతంలో రూ.3వేల వరకు వేతనం ఇచ్చేవారు. గత కేసీఆర్ ప్రభుత్వం రూ.8,500 వేతనం ఇస్తూ మల్టీపర్పస్ కార్మికులుగా నియమించింది. గ్రామపంచాయతీల్లో ఏ పనులైనా చేయాలని ఆదేశించింది. రోడ్లు, డ్రెయినేజీలు శుభ్రం చేసి, చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలి. పారిశుద్ధ్య పనులు, వీధి దీపాలు, పార్కుల నిర్వహణ, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడం, నీళ్లు పట్టడంతోపాటు పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్లుగా, విద్యుత్, వాటర్‌మెన్‌గా సేవలందించాలి. వీటితోపాటు ఇతర పనులు చేయాల్సి రావడంతో కార్మికులు పనిఒత్తిడికి గురవుతున్నారు. కనీస వేతన చట్టం అమలు చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హామీలు నెరవేర్చాలి..

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అగ్రనేతలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పంచాయతీ కార్మికులు ఇప్పటికే ఆందోళన బాటపట్టారు. కార్మిక సంఘాలు ఐక్యంగా ముందుకు సాగుతూ తమ డిమాండ్లను ప్రభుత్వానికి నివేదించాయి. సమస్యల పరి ష్కారం కోసం క్షేత్రస్థాయిలో ధర్నాలు చేయగా ఈ నెల 17న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌కు తరలివెళ్లేందుకు ప్రయత్నించిన మల్టీపర్పస్ వర్కర్లను పోలీసులు అక్రమంగా చేయడాన్ని నిరసిస్తూ జేఏసీ నాయకులు పిలుపుమేరకు ఈ నెల 18, 19న తేదీల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే 20వ తేదీ తర్వాత ఏరోజు నుంచైనా సమ్మెకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని గ్రామ పంచాయతీల మల్టీపర్పస్ కార్మికులు కోరుతున్నారు.

ప్రభుత్వం దిగొచ్చేదాకా సమ్మె చేస్తాం..



గ్రామ పంచాయతీల్లో పనిచేసే మల్టీపర్ప వర్కర్లు సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యాన ఇప్పటికే పలుమార్లు ఆందోళనలు చేసి ప్రభుత్వానికి విన్నవించాం. పలు డిమాండ్లతో సమ్మె నోటీస్ ఇచ్చాం. ప్రభుత్వం ఇప్పటికై నా స్పందించి తమ న్యాయమైన డిమాండ్లపై చర్చలు జరపాలి. ఉద్యోగ భద్రతోపాటు కనీస వేతనం చెల్లించాలి. ఈనెల 20వ తేదీ తర్వాత ప్రభుత్వం దిగివచ్చే వరకూ సమ్మె చేస్తాం.

- అబ్బదాసి అశోక్,గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

జమిడికం వాయిస్తూ వారి సంస్కృతీసంప్రదాయాలు వివరిస్తున్న బైండ్ల సంఘం నాయకులు, కుల వృత్తిదారులు



వినతుల స్వీకరణ.. వివరాలు ఆరా..

ఎస్సీ వర్గీకరణపై సాగిన ఏకసభ్య కమిషన్ విచారణ

- ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక
- కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ వెల్లడి
- మొత్తం 135 వినతిపత్రాలు, దరఖాస్తులు

ఎస్సీ వర్గీకరణ అంశంపై హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయిలో కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ గురువారం బహిరంగ విచారణ జరిపారు. ఆయనకు వివిధ కుల, వృత్తి, సామాజిక, ఉద్యోగ సంఘాల నాయకులు, బాధ్యులు తమ డిమాండ్లపై వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా అభిప్రాయ సేకరణ జరిపి శాస్త్రీయంగా ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందించనున్నట్లు కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్ తెలిపారు. - హన్మకొండ - 8లో▸

జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం



సంగెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై నరేశ్

సంగెం: దాతల సహకారంతో సంగెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎస్సై ఎల్.నరేశ్, ప్రిన్సిపాల్ కాక మాధవరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై నరేశ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి కల్పించేందుకు అధ్యాపకులు కృషి చేయడం అభినందనీయమన్నారు. కళాశాలలోని మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. దాతలు ముందుకు వచ్చి ఎలాంటి ఆటంకాలు లేకుండా మధ్యాహ్న భోజన పథకం కొనసాగాలా చూడాలని ప్రిన్సిపాల్ కోరారు. వంట చేయడానికి సైతం కళాశాల సిబ్బంది ముందుకు రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. దాతలు శ్యామల శిల్ప, వల్లాల శైలజ, పుసులేటి జానకి, రోజనాల నరసన్ (హైదరాబాద్), రావిపాటి వెంకటేశ్వర్‌రావు, వల్లంపట్ల సంపత్‌కుమార్, సులి రాజశేఖర్, కన్నెబోయిన నవీన్, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది కారంతో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రక్‌షీట్లు లేకుండా ధాన్యం దిగుమతి చేయొద్దు

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి

దుగ్గొండి: ట్రక్‌షీట్లు లేకుండా కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని మిల్లులకు దిగుమతి చేసుకోవద్దని అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆదేశించారు. గిర్నిబావిలోని గుణ లోకేశ్వర మిల్లును గురువారం ఆమె తనిఖీ చేశారు. ధాన్యం దిగుమతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ట్రాక్టర్లలో ధాన్యం ఎందుకు తరలిస్తున్నారు, కాంట్రాక్టర్ లారీలు సమకూర్చడం లేదా అని ప్రశ్నించారు. ఐకేపీ నిర్వాహకులను పిలిపించి అక్కడికక్కడే ట్రక్‌షీట్లు రాయించారు. అనంతరం మైసంపల్లి, ముద్దునూరు, పోలారం, దుగ్గొండి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తనిఖీలు చేశారు. ఆమె వెంట సివిల్ సప్లయీస్ డీఎం సంధ్య, తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, ఆర్ఐ రాంబాబు, మిల్లు యజమాని జంగా రాజిరెడ్డి, ఎంపీఎం రాజ్‌కుమార్, సమాఖ్య అధ్యక్షురాలు లలిత, సీసీలు, నిర్వాహకులు ఉన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అదనపు కలెక్టర్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

గిర్నిబావిలోని మహాత్మా జ్యోతిరావుపూలే బాలుర గురుకుల విద్యాలయాన్ని అదనపు కలెక్టర్ సంధ్యారాణి తనిఖీ చేశారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. భోజనం ఎలా ఉంది, నూతన మెనూ పాటిస్తున్నారా లేదా అని అడిగారు. వంటలను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ విషయంలో తప్పులు చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆమె వెంట తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, ఎంపీడీఓ లెక్కల అరుంధతి, ప్రిన్సిపాల్ ఓదెల మల్లయ్య ఉన్నారు.

డబుల్ బెడ్‌రూంల పరిశీలన

రాయపర్తి: మండలంలోని కొండూరులో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను జెడ్పీ సీఈఓ రాంరెడ్డి గురువారం పరిశీలించా. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుగులోత్ కిషన్‌నాయక్, ఎంపీఓ కూచన ప్రకాశ్, ఐబీ ఏఈ బాలదాస్, పంచాయతీ కార్యదర్శి రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చక్కని పంటకు చుక్కల మందు!



నాచినపల్లిలో మొక్కజొన్న చేనులో చుక్కల మందు వేస్తున్న రైతు కుటుంబ సభ్యులు

మొక్కజొన్న చేనులో కత్తెర పురుగును అదుపు చేయదానికి ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం కనిపించడం లేదు. దీంతో రైతులు మొక్కమొక్కకు చుక్కల మందును ఎంచుకున్నారు. కోరాజిన్, డెలిగేట్ లాంటి మందులను నీళ్లలో కలిపి, వాటర్ బాటిళ్లలో నింపి చిన్న రంధ్రం చేసి మొక్కమొక్కకు చుక్కలు వేస్తున్నారు. నాచినపల్లి–పొనకల్ ప్రధాన రహదారి పక్కన రైతు జటబోయిన రవి పొలంలో గురువారం కనిపించిన ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది. - దుగ్గొండి

'తోడు' వీడి.. నింగికేగి

'బలగం' మొగిలయ్య ఇక లేరు

- తోడుగా మాతో ఉండి పాటతో పేరు ప్రఖ్యాతలు
- కొన్నేళ్లుగా తీవ్ర అనారోగ్యం..
- దుగ్గొండిలో అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు పూర్తి
- పాటలతో నివాళులర్పించిన కళాకారులు



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, నాయకులు



బలగం సినిమా దర్శకుడు యెల్దండి వేణుతో మొగిలయ్య, కొమురమ్మ దంపతులు (ఫైల్)

సాక్షి, వరంగల్/దుగ్గొండి: సంచార జాతినుంచి యక్షగానంతో సినీ తెరకు పరిచయమైన బలగం మొగిలయ్య ఇక లేరు.. ఆయన తంబూర మూగబోయింది.. కిడ్నీలు ఫెయిలై, గుండె సమస్య రావడం, కంటి చూపు కోల్పోయి తీవ్ర అనారోగ్య సమస్యలతో మూడేళ్లుగా బాధ పడుతున్న పస్తం మొగిలి అలియాస్ బలగం మొగిలయ్య (67) వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా గురువారం ఆరోగ్యం విషమించింది. ఎంజీఎం ఆస్పత్రికి తరలించేలోపు తుదిశ్వాస విడిచారు. దిల్ రాజు బ్యానర్‌పై దర్శకుడు యెల్దండి వేణు నిర్మించిన బలగం సినిమాలో చివరి ఘట్టంలో 'తోడుగా మాతోడుండి.. నీడగా మాతో నిలిచి' అనే పాట పాడి కోట్లాది మంది ప్రజల హృదయాలకు దగ్గరైన మొగిలయ్య ఓరుగల్లుకే బలగమయ్యారు. పలువురు కళాకారులు, గ్రామస్తులు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు.

దహన సంస్కారాల కోసం ఆర్థిక సాయం..

మొగిలయ్య మృతి వార్త తెలుసుకున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రూ.50 వేలు, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.50వేలు ఆర్థికసాయం పంపించారు. వారి ప్రతినిధులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, ఎల్కతుర్తి మండల నాయకుడు బొమ్మెనపల్లి అశోక్‌రెడ్డి.. మొగిలయ్య భార్య కొమురమ్మకు అందించారు. మొగిలయ్య మృతదేహాన్ని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన మృతి జానపద కళకు తీరని లోటన్నారు. ప్రభుత్వం మొగిలయ్య కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వరంగల్ పశ్చిమ, నర్సంపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బలగం సినిమా నటుడు రచ్చ రవి, పలువురు కళాకారులు సంతాపం ప్రకటించారు. సాయంత్రం పలువురు కవులు, కళాకారులు పాటలతో మొగిలయ్యకు నివాళులర్పించారు. అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి.

ఓరుగల్లుకే పేరు తెచ్చారు..



మొగిలయ్య (ఫైల్)

దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన పస్తం మొగిలి(67), కొమురమ్మ దంపతులు బేడ బుడిగ జంగాలు. శార్థ కథ కథలు చెబుతూ జీవనం సాగిస్తున్నారు. వీరి పూర్వీకులది కమలాపూర్ మండలం అంబాల కేశవాపురం. మొగిలి తల్లిదండ్రులు పస్తం పెంటయ్య, ముత్తమ్మ ఉపాధి కోసం మల్లారెడ్డిపల్లి, సిద్ధాపురం గ్రామాల్లో కొన్నాళ్లు ఉండి 30 ఏళ్ల క్రితం దుగ్గొండికి వచ్చి స్థిరపడ్డారు. మొగిలి తన భార్యతో కలిసి గ్రామాల్లో కథలు చెప్పి గుర్తింపు పొందారు. ఈ క్రమంలో బలగం సినిమా డైరెక్టర్ యెల్దండి వేణుకు పస్తం మొగిలిని ఒగ్గుకథ కళాకారుడు కాయితి బాలు పరిచయం చేశారు. అలా బలగం సినిమాలో మొగిలయ్యతో పాడించిన 'తోడుగా మాతో ఉండి... నీడగా మాతో నడిచి' అనే పాట ప్రజల గుండెలను హత్తుకుని కంటతడి పెట్టించింది. ఈ పాటతో మొగిలి, కొమురమ్మ దంపతులకు పేరు ప్రఖ్యాతలు రావడంతోపాటు వరంగల్ జిల్లా పేరు మార్మోగింది. ఇటీవల పొన్నం సత్తయ్య ఫౌండేషన్ అవార్డును మంత్రి పొన్నం ప్రభాకర్ అందించారు. ఇంటి స్థలంతోపాటు ఇల్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఉనికిచర్లలో ఇంటిస్థలాన్ని కేటాయించారు. పట్టా కాగితాలు అందుకునే తరుణంలోనే మొగిలయ్య కన్నుమూశారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

రాయపర్తి: ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి, హెచ్‌ఎం అజ్మీరా ఉమాదేవి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు మైలారం ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటి నుంచి 8వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులకు పలు సబ్జెక్ట్‌లపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. విద్యార్థుల చేతిరాత మెరుగ్గా ఉండే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్పీలు వెంకటేశ్వర్‌రావు, రజినీకాంత్, వెంకటరమణ, రాజు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం లాభదాయకం

- మామునూరు కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సౌమ్య

వర్ధన్నపేట: ప్రకృతి సేద్యం లాభదాయకమని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య అన్నారు. మండలంలోని చంద్రుతండాలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహజ ఎరువులతో పంటలను సాగుచేయాలని సూచించారు. ఇందుకు ఆవుమూత్రం, పేడ, పాలు, పెరుగు తదితర వాటిని వినియోగించుకోవాలన్నారు. అదేవిధంగా పప్పు దినుసుల పంటల సాగుతో నేలలో సారం పెరుగుతుందని వివరించారు. నేలలో నీటి నిల్వ తత్వాన్ని పెంచుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. డాక్టర్ రాజు విత్తన శుద్ధి, పంట వివిధ దశల్లో జీవామృతం, చీడపీడల నివారణకు వేప కషాయం, పొగాకు కషాయం, పచ్చిమిర్చితో తయారు చేసిన మిశ్రమాలను తెగుళ్లు, పురుగుల నివారణకు ఉపయోగించే విధానాన్ని వివరించారు. రైతులు సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తిచేశారు. కార్యక్రమంలో 100 మంది రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్మశానవాటిక శుభ్రం..



శ్మశాన వాటికలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

నర్సంపేట: నర్సంపేట పట్టణం వరంగల్ రోడ్డు లోని శ్మశానవాటికలో అపరిశుభ్ర వాతావరణం నెలకొని అంత్యక్రియల సందర్భంగా బుధవారం ఓ బాలికకు గాజు పెంకు గుచ్చుకుని తీవ్రంగా రక్తం చిందింది. ఈ ఘటనపై 'అంత్యక్రియల్లో అపాయం' అనే శీర్షికతో 'సాక్షి' ఎక్స్ క్లూజివ్ కథనాన్ని ప్రచురించింది. దీనికి ఉన్నతాధికారులు స్పందించారు. గురువారం సిబ్బందితో శ్మశానవాటికను శుభ్రం చేయించారు. శవదహన పేటికల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. దీనిపై పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

కాజీపేట జంక్షన్‌కు న్యూ లుక్




నిర్మాణంలో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ త్వరలో అంతర్జాతీయ విమానాశ్రయం మాదిరిలా కొత్త లుక్‌తో కనిపించనుంది. అమృత్ భారత్ స్కీం స్టేషన్ నిర్మాణ పనుల్లో భాగంగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఫుట్ ఓవర్‌బ్రిడ్జి, ఎస్కలేటర్, లిఫ్ట్, ప్లాట్‌ఫాంలు, ప్రయాణికులు వేచి ఉండే గదులు అన్ని విధాలా సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట జంక్షన్ ఎదుట సర్క్యులేటింగ్ ఏరియాను, ఇతర అభివృద్ధి పనులను అత్యాధునీకరించనున్నారు. కాగా.. గురువారం రైల్వే అధికారులు కాజీపేట జంక్షన్ అమృత్‌భారత్ నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించినట్లు స్థానిక అధికారులు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా నిరుద్యోగ యువతీయువకులకు ములుగు రోడ్డు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి సీహెచ్.ఉమారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభంకానున్న జాబ్‌మేళాకు అర్హత, ఆసక్తిగల వారు విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు.పూర్తి వివరాలకు 7093168464 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మహిళలు.. స్వశక్తులు



మైనారిటీలకు ఇందిరా మహిళాశక్తి పథకం

- స్వశక్తితో ఎదిగేలా ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ
- మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో గడువు

న్యూశాయంపేట: మహిళలు ఓ వైపు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే.. మరోవైపు తమకు ఆసక్తి ఉన్న టైలరింగ్‌పై మక్కువ చూపుతున్నారు. స్వశక్తితో ఎదగడానికి సొంతంగా షాపు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా నిలబడాలని నిరుపేద, మధ్యతరగతి మహిళలు భావిస్తున్నారు. ఇలాంటి మహిళలకు చేయూత నిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. మహిళలు ఆర్థిక స్వావలంబనవైపు అడుగులు వేసేందుకు రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి పథకం పేరుతో మైనారిటీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు బౌద్ధులు, పార్శీలు) మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేసేందుకు ముందుకొచ్చింది. ఇందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

దరఖాస్తుకు అర్హతలు..

18 నుంచి 55 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలు ఈ పథకానికి అర్హులు. పేద మైనారిటీ మహిళలు, విడాకులు పొందినవారు, వితంతువులు, ఒంటరి మహిళలు , అనాథలకు తొలి ప్రాధాన్యం. ఆధార్ లేదా ఓటర్ ఐడీ కార్డు జతచేయాలి. కనీస విద్యార్హత 5వ తరగతి వరకు చదివి ఉండాలి. తెల్లరేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు ఉండాలి. కార్డు లేని వారు సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతల్లోని వారైతే రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతం వారైతే రూ. 2 లక్షల లోపు ఆదాయం కలిగి ఉన్నట్లు తహసీల్దార్‌ధ్రువీకరించిన ఆదాయ ధ్రువీకరణ పత్రం జత చేయాలి. గుర్తింపు పొందిన శిక్షణ సంస్థ నుంచి శిక్షణ పొందినట్లు సర్టిఫికెట్ ఉన్న వారికి పథకంలో ప్రాధాన్యం ఉంటుంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు..

అర్హత కలిగిన మహిళలు తమ పాస్‌ఫొటోతో డిసెంబర్ 31 తేదీలోగా ఆన్‌లైన్ tgobmms. cgg. gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ ప్రక్రియ అనంతరం హార్డ్‌కాపీలను డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జతపరిచి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న జిల్లా మైనారిటీ సంక్షేమాభివృద్ధి కార్యాలయాల్లో అందచేయాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు ఆయా జిల్లాల కార్యాలయాల్లో సంప్రదించాలని మైనారిటీ సంక్షేమశాఖ అధికారులు సూచించారు.

రూ. లక్ష వరకు ఆర్థిక సాయం అందించాలి



మహిళలకు ఉచిత కుట్టుమిషన్‌తో పాటు రూ. లక్ష వరకు ఉచితంగా ఆర్థిక సాయం అందించాలి. మహిళలు పూర్తిస్థాయిలో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం ఉంది. కుట్టుమిషన్లు అందుకున్న మహిళలకు మగ్గం వర్క్స్, ఎంబ్రాయిడరీ, బ్లౌజ్ డిజైనింగ్ అడ్వాన్స్ టెక్నాలజీ శిక్షణ అందించాలి.

-మహ్మద్ షకీల్ అహ్మద్, బీఆర్‌ఎస్ నాయకుడు

ఇళ్ల సర్వే పారదర్శకంగా నిర్వహించండి



సర్వేను పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్

ఖిలా వరంగల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. ఈమేరకు గురువారం వరంగల్ 17వ డివిజన్ ఆదర్శనగర్‌లో జరుగుతున్న సర్వే తీరును కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సమర్థవంతంగా నిర్వహించేందుకు సూచనలిచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాస్తవ సమాచారం మేరకు అర్హులను నమోదు చేయాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ కృష్ణా రెడ్డి, ఆర్‌ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

లిఖిత ఫర్నిచర్ షాపులో అగ్నిప్రమాదం

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అలంకార్ జంక్షన్‌లో గల లిఖిత ఎంటర్‌ప్రైజెస్(ఫర్నిచర్‌షాపు)లో గురువారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. షాపులో నుంచి మంటలు, పొగ రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. షాపులో మంటలతోపాటు, పెద్ద ఎత్తున పొగ వచ్చిందని తెలిపారు. ఫైర్ ఇంజన్‌ను పిలిపించి మంటలు ఆర్పివేసినట్లు ఆయన చెప్పారు. ఏమేరకు నష్టం జరిగిందో తెలియాల్సి ఉందని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

విద్యార్థుల మధ్య వివాదం..

- ఎంబీఏ విద్యార్థులను కొట్టిన బీపీఈడీ స్టూడెంట్స్
- ఎంబీఏ విద్యార్థుల ఆందోళన
- చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్‌కు వినతి
- నలుగురు విద్యార్థులు పదిరోజులు సస్పెన్షన్



రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదం చేస్తున్న ఎంబీఏ విద్యార్థులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో బీపీఈడీ, ఎంబీఏ విద్యార్థుల మధ్య వివాదం తలెత్తింది. రిజిస్ట్రార్ మల్లారెడ్డి కథనం ప్రకారం.. బుధవారం సాయంత్రం క్రీడా మైదానంలో ఎంబీఏ విద్యార్థులు క్రికెట్ ఆడుతుండగా పలువురు బీపీఈడీ విద్యార్థులు, ఓ హిస్టరీ విద్యార్థి వచ్చి తాము ఆడుకోవాల్సిన గ్రౌండ్‌లో మీరెలా ఆడుతారని అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. అంతేగాకుండా ఇద్దరు, ముగ్గురు విద్యార్థులను కొట్టారు. ఈ ఘటనలో దాడికి పాల్పడిన విద్యార్థులను పర్మనెంట్‌గా సస్పెండ్ చేయాలని గురువారం ఎంబీఏ విద్యార్థులు పరిపాలన భవనం వద్ద ఆందోళనకు దిగారు. అనంతరం ఈ విషయాన్ని రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లి వారిని సస్పెండ్ చేయాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఘటనపై కమిటీ వేసి వారిచ్చే నివేదికను బట్టి చర్యలుతీసుకుంటామని హామీ ఇవ్వగా విద్యార్థులు శాంతించారు. కాగా, గురువారం సాయంత్రం ముగ్గురు బీపీఈడీ విద్యార్థులు, ఓ హిస్టరీ విద్యార్థిని క్లాసులు , హాస్టల్ నుంచి పదిరోజులపాటు సస్పెండ్ చేశామని రిజిస్ట్రార్ వెల్లడించారు. క్రీడామైదానంలో ఏ విభాగం విద్యార్థులైనా ఆడుకోవచ్చన్నారు. వివాదం తలెత్తడానికి గల కారణాలు తెలుసుకునేందుకు కమిటీని నియమించినట్లు పేర్కొన్నారు. కమిటీ ఇచ్చే రిపోర్టు అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపికలు



వరంగల్ స్పోర్ట్స్: సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా ఈనెల 21న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్స్ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని హ్యాండ్‌బాల్ గ్రౌండ్ వద్ద ఉదయం 9 గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

కస్నా నాయక్, చాందీబాయి @ 75



వధువు మెడలో మాంగళ్యధారణ చేస్తున్న పెళ్లి కుమారుడు

భూపాలపల్లి రూరల్: ఆయన వయస్సు 88, ఆమె వయస్సు 87.. నుదుట పెళ్లి బొట్టు.. తలకు పాగా, పట్టు వస్త్రాలు.. వధువు సిగ్గు పడుతుండగా.. మంగళ వాయిద్యాలు మోగుతుండగా వేదమంత్రోచ్చరణల మధ్య వరుడు.. వధువు మెడలో మాంగళ్యధారణ చేశాడు. వారి వయస్సు ఏమిటీ?.. ఇప్పుడు పెళ్లి ఏమిటనుకుంటున్నారా..అయితే ఈ వార్త పూర్తిగా చదవండి. భూపాలపల్లి మండలంలోని గొల్లబుద్దారం గ్రామానికి చెందిన నూనవత్ కస్నా నాయక్, చాందీ బాయి దంపతులకు పెళ్లయి గురువారానికి 75 వసంతాలు పూర్తయ్యాయి. పెళ్లిరోజు సందర్భంగా కుమారులు, కూతుళ్లు, మనుమలు, మనుమరాళ్లు కలిసి మరోసారి సంప్రదాయ బద్ధంగా ఇద్దరికి పెళ్లి జరిపించారు. పెళ్లికి గ్రామస్తులతో పాటు బంధువులను ఆహ్వానించి విందు భోజనాలు పెట్టారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. మారుమూల గ్రామంలో వ్యవసాయం చేస్తూ ఎన్ని కరువు కాటకాలు వచ్చినా ఐదుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లను ఉన్నత చదువులు చదివించి వారిని ప్రయోజకులుగా చేసి, ఆదర్శంగా నిలిచారని గ్రామస్తులు, బంధువులు ఆ దంపతులను కొనియాడారు.

వినతుల స్వీకరణ.. వివరాలు ఆరా..

ఎస్సీ వర్గీకరణపై సాగిన ఏకసభ్య కమిషన్ విచారణ

- శాస్త్రీయంగా డేటా సేకరిస్తున్నాం.. ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక
- రాష్ట్ర షెడ్యూల్ కులాల విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్
- మొత్తం 135 వినతిపత్రాలు, దరఖాస్తులు



విచారణలో మాట్లాడుతున్న ఎస్సీవర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్

హన్మకొండ: వినతులు స్వీకరిస్తూ... వివరాలు తెలుసుకుంటూ ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ విచారణ సాగించింది. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో ఎస్సీ వర్గీకరణపై కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ బహిరంగ విచారణ జరిపారు. వివిధ కుల, వృత్తి, సామాజిక, ఉద్యోగ సంఘాలనుంచి వినతిపత్రాలు అందుకున్నారు. ప్రధానంగా ఉప కులాల ప్రతినిధులు వినతిపత్రాలు అందించినప్పుడు వారి సంస్కృతీసంప్రదాయాలు, వృత్తి, జీవన విధానాన్ని తెలుసుకున్నారు. సంఘాల ప్రతినిధులు చెప్పిన వివరాలు, డిమాండ్లు, కోరికలు, సమస్యలు నోట్ చేసుకున్నారు. మొత్తం 135 వినతిపత్రాలు, దరఖాస్తులు వచ్చాయి. బైండ్ల సంఘం ఆధ్వర్యంలో వారి కులస్తులు జస్టిస్ షమీమ్ అక్తర్‌కు వినతిపత్రం అందించి జమిడిక వాయించి స్తుతి, పంబతో కులవృత్తిని వివరిస్తూ చేసిన ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఏక సభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ షెడ్యూల్ కులాల నుంచి వచ్చిన విన్నపాలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆయా వర్గాలనుంచి వినతులు, వివరాలు తెలుసుకుంటూనే మరోవైపు శాస్త్రీయ పరిశీలనలో భాగంగా అవసరమైన డేటాను వివిధ ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి తెప్పించుకుంటున్నామన్నారు. ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందిస్తామన్నారు. అంతకుముందు ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను వరంగల్ కలెక్టర్, హనుమకొండ ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్యశారద మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందించి స్వాగతం పలికారు. పలు అంశాలపై చర్చించారు.

ఏకసభ్య కమిషన్‌కు వినతుల వెల్లువ

- అత్యంత వెనుకబడిన మితఅయ్యల్‌వార్ కులాన్ని ఎస్సీ వర్గీకరణ ఏ గ్రూప్‌లో చేర్చాలని ఆ సంక్షేమ సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. మా కులాన్ని సైతం ఏ గ్రూప్‌లో చేర్చాలని తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం నాయకులు కోరారు.
- ఎస్సీ వర్గీకరణలో మాదిగల జనాభా దామాషా ప్రకారం 70శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు.
- వర్గీకరణలో మోచీలకు ప్రాధాన్యం ఇవ్వాలని సమగర (మోచీ) కుల సంఘం నాయకులు కోరారు.
- రాజ్యాంగ విరుద్ధమైన షెడ్యూల్ కులాల వర్గీకరణను, సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తున్నామని, ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరుతూ మాల మహానాడు నాయకులు వినతి పత్రం అందించారు.
- మా కులాన్ని ఎస్సీ వర్గీకరణలో ఏ గ్రూప్‌లో చేర్చాలని, అభివృద్ధి, సంక్షేమ, రాజకీయంగా ప్రాధాన్యం కల్పించాలని, చిందు హక్కుల పోరాట సమితి, చిందు యక్షగాన వృత్తి కళాకారుల సంఘం నాయకులు కోరారు.
- ఎస్సీ జనాభాలో 70 శాతంగా ఉన్న మాదిగలకు 10శాతం, 30 శాతం ఉన్న మాలలకు 4 శాతం, ఉప కులాలకు ఒకశాతం రిజర్వేషన్ అమలు చేయాలని మాదిగ జాగృతి సంఘం నాయకులు విన్నవించారు.
- ఉప కులాల వారికి 8 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బేడ (బుడగ) జంగం ఫెడరేషన్ నాయకులు కోరారు.
- మాదిగ ఉప కులాల సమగ్రాభివృద్ధికి ఎస్సీ వర్గీకరణ చేయాలని షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ ప్రతినిధులు కోరారు.
- రాజ్యాంగంలోని 341 ఆర్టికల్ ప్రకారం దేశంలోని అన్ని రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయం సేకరించి 2/3 మెజారిటీతో బిల్లు ప్రవేశపెట్టి అమోదం పొందిన తర్వాత ఎస్సీ వర్గీకరణ చేయాలని తెలంగాణ మాల మహానాడు నాయకులు కోరారు.

ఉన్నతస్థాయి ఉద్యోగులు ఉన్నారా?

- సుబ్బయ్యపల్లి గ్రామ సందర్శన



సుబ్బయ్యపల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్

హసన్‌పర్తి : గ్రామంలో ఎవరైనా ఉన్నతస్థాయి ఉద్యోగం చేస్తున్నారా అని ఎస్సీ కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్ ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణపై నియమించిన కమిషన్ గురువారం హసన్‌పర్తి మండలం సుబ్బయ్యపల్లి సందర్శించారు. ముందుగా ఆయన స్థానికులతో ముచ్చటించారు. గ్రామం నుంచి డాక్టర్లు, ఇంజనీర్లతోపాటు ఇతర వర్గాలకు చెందిన వారు ఎవరైనా ఉన్నారా అని అడిగారు. గ్రామంలో ఎన్ని కులాలు ఉన్నాయి? ప్రధాన కులం ఏదీ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ ఫలాలు అందుతున్నాయా అని అడిగారు. ఈసందర్భంగా ఓ వృద్ధుడు వచ్చి ముగ్గురు కుమారులు, కోడలు అకాల మరణం చెందారని, దీంతో తన పోషణ భారంగా మారిందని కమిషన్ ముందు తమ ఆవేదన వెలిబుచ్చాడు. ఆయనవెంట అధికారులు ఉన్నారు.

అమిత్ షాను మంత్రివర్గంనుంచి తొలగించాలి



కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

- కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల రామకృష్ణ

హన్మకొండ: పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో నిరసన చేపట్టారు. అనంతరం డప్పు చప్పుళ్ల మధ్య శవయాత్ర నిర్వహించి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇక్కడి నుంచి ర్యాలీగా సుబేదారి పీఎస్‌కు చేరుకుని అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ అమిత్‌షా రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి ప్రపంచ మేధావి అంబేడ్కర్‌ను కించపరిచారన్నారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌లో ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్‌కు ఎస్సీ వర్గీకరణ ఆలస్యం కాకుండా చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ విభాగం చైర్మన్ అజీజ్, డాక్టర్స్ సెల్ చైర్మన్ శ్రవణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని లక్ష్మారెడ్డి, స్టేట్ యూత్ జనరల్ సెక్రెటరీ శ్వేత, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రూ.96,200 విలువైన నూకలు స్వాధీనం

- ఐదుగురిపై కేసు.. ముగ్గురు పరారీ



హసన్‌పర్తి: స్వాధీనం చేసుకున్న నూకలు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామంలో గురువారం రూ.96,200 విలువైన నూకలను సీజ్ చేశారు. ఈ ప్రాంతంలో రేషన్ బియ్యాన్ని ఖరీదు చేసి నూకలుగా మార్చి విక్రయించడానికి తీసుకెళ్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 37 క్వింటాళ్ల నూకలు స్వాధీనం చేసుకున్నారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాలకు చెందిన గొండ సాయి, గోల్కొండ రాజేశ్, వరంగల్ లేబర్ కాలనీకి చెందిన గుడిపాక అక్షయ్, గోవిందుల గణేశ్, హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన బోళ్ల మమతపై కేసు నమోదు చేశారు. ఇందులో రాజేశ్, గుడిపాక అక్షయ్, గోవిందుల గణేశ్ పరారీలో ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని చాటాలి

- శాట్ చైర్మన్ శివసేనారెడ్డి
- ముగిసిన సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు
- రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలు షురూ



క్రీడా జ్యోతిని అందుకుంటున్న శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, కలెక్టర్ సత్యశారద

వరంగల్ స్పోర్ట్స్: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనా రెడ్డి అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మూడు రోజులుగా కొనసాగుతున్న సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీ అందజేశారు. ముందుగా క్రీడాకారుల చేతుల మీదుగా క్రీడా జ్యోతిని ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్యశారదతో కలిసి అందుకున్నారు. క్రీడా పతాకాన్ని ఎగురవేసి, క్రీడాకారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా శాట్ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడాకారుడిగా.. క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. క్రీడల్లో ఒక్కరే విజయం సాధిస్తారని, ఓడిన వారు కుంగిపోకుండా విజయం కోసం సాధన చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలు షురూ..

రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలు జేఎన్‌ఎస్‌లోని జిమ్నాజియం హాల్‌లో గురువారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్రీడాకారులను ఉద్దేశించి (వర్చువల్‌గా) మాట్లాడారు. జిమ్నాస్టిక్స్ అంటేనే వరంగల్ గుర్తుకొస్తుందన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో 15 జిల్లాల నుంచి 200ల మంది క్రీడాకారులు, 50 మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటున్నట్లు వెల్లడించారు. క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోతు అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ముగింపు వేడుకల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, కోచ్‌లు, పీఈటీ, పీడీలు తదితరులు పాల్గొన్నారు.